నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 7 మే 2025 | HYDERABAD



బారికేడ్లు పెట్టి చలాన్లు ▸ బషీర్‌బాగ్ చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టి ట్రాఫిక్ జామ్ చేస్తూ చలాన్లు వేస్తున్న పోలీసులు



మంగళవారం నగరంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్




జమ్ములో ఓ బడిలో ఆపరేషన్ అభ్యాస్ జరుగుతున్న దృశ్యం

## భద్రత కట్టుదిట్టం.. అంతటా అప్రమత్తం

*మాక్ డ్రిల్ నిర్వహించే సమయంలో నగర వ్యాప్తంగా భద్రతా బలగాలు మోహరిస్తాయి. రెవెన్యూ, పౌర సరఫరాలు, జీహెచ్ఎంసీ ఇతర స్థానిక సంస్థల అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంటారు. సురక్షిత ప్రాంతాలు, సెల్లార్లు, బంకర్లకు తరలించేందుకు రవాణా శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటారు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు, భవనాల్లోని లైట్లు, ప్రకటనల లైట్లను ఆపేస్తారు. మాక్ డ్రిల్ సమయం కాగానే ఇండస్ట్రియల్ సైరన్లు, ప్రధాన కూడళ్లలో పోలీసు మైకులు, ఫైర్ సైరన్లు వినిపిస్తాయి. ఇదంతా వేగంగా పకడ్బందీగా జరుగుతుంది. ప్రతి అంశాన్ని పోలీసు బలగాలు కండ్లకు కట్టినట్లు చూపిస్తారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఏవిధంగా స్పందించాలో, భద్రతా బలగాలకు ఎలా సహకరించాలో ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తారు. ఎంపిక చేసిన ప్రదేశంలోని ప్రజలు అధికారులకు సహకరించి మాక్ డ్రిల్‌లో పాల్గొనాలని అధికారులు సూచించారు.*





# యుద్ధం.. సన్నద్ధం

## నేడు ఆపరేషన్ అభ్యాస్ మాక్ డ్రిల్

### సాయంత్రం 4 గంటలకు మోగనున్న సైరన్‌లు

### ఓఆర్ఆర్ లోపలి 4 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్న బలగాలు

### నగరవ్యాప్తంగా భద్రతా బలగాల మోహరింపు

**సిటీ బ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ):** నగరంలో నేడు 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో కేంద్ర రక్షణ శాఖకు చెందిన బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించనున్నాయి. హైదరాబాద్ వ్యాప్తంగా సైరన్ల మోత మోగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు ఎంపిక చేసిన ప్రాంతాలైన సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, మౌలాలి ఎన్‌ఎఫ్‌సీలో ఎయిర్ రైడ్ డ్రిల్ జరుగుతుంది. 4.15 గంటలకు 30 నిమిషాల పాటు మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. అన్ని కూడళ్లలో 2 నిమిషాల పాటు సైరన్లు మోగనున్నాయి. ఆ సమయంలో ఇండ్లలో ఉన్నవారు ఎలక్ట్రిక్ పరికరాలు, గ్యాస్ స్టవ్, లైట్లు ఆపేయాలని అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఇండ్లు, భవనాల సెల్లార్లు, కట్టుదిట్టమైన స్థావరాలకు వెళ్లాలి. అప్పుడున్న ప్రదేశంలో ఆశ్రయం దొరక్కపోతే తలను దేనితోనైనా కప్పుకుని తక్కువ విస్తీర్ణమున్న ప్రదేశంలో దాక్కోవాలి. 4.30 గంటలకు ప్రమాదమేలేదని అధికారులు ప్రకటించిన తర్వాత బయటకు రావాలి. వదంతులను నమ్మకుండా ప్రభుత్వ అధికారుల ప్రకటనలు మాత్రమే అనుసరించాలి.

టీవీలు, ప్రసార మాధ్యమాలు, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలి. ఈ మాక్ డ్రిల్‌లో మొత్తం 12 డిఫెన్స్ బలగాలు పాల్గొననున్నాయి. సైరన్లు మోగగానే మాక్ డ్రిల్ చేపట్టే ప్రాంతాలకు పోలీసులు, ఫైర్, ఎస్డీఆర్‌ఎఫ్, వైద్య, రెవెన్యూ, స్థానిక అధికారులు చేరుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. భద్రతా బలగాలకు ఎలా సహకరించాలి. ఆత్మ రక్షణ ఎలా చేసుకోవాలో భద్రతా బలగాల అధికారులు కళ్లకు కట్టినట్లు చూపిస్తారు.



లక్నోలో మంగళవారం జరిగిన మాక్ డ్రిల్

# జీహెచ్‌ఎంసీలో మరో గలీజు దందా

- స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండానే అప్పగింత
- పార్కును మూడేళ్ల పాటు ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టిన జోనల్ కమిషనర్
- జోనల్ అధికారాలు కట్ చేస్తూ నిర్ణయం
- ఇక మీదట స్టాండింగ్ కమిటీలో చర్చించాకే లీజు ఇవ్వనున్న అధికారులు

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో గ'లీజు' వ్యవహారం మరో చోట వెలుగులోకి వచ్చింది..బల్దియా ఆస్తులను అక్రమ పద్ధతిలో లీజుకు తీసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. ఏళ్ల తరబడి లీజు గడువు ముగిసిన వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఎస్టేట్ విభాగం నిర్లక్ష్యాన్ని ఆసరా చేసుకుంటూ ప్రైవేట్ వ్యక్తులు ఇష్టారీతిలో దందా చేస్తున్నారు. మార్కెట్లు, మున్సిపల్ దుకాణాలే కాదు పార్కులను సైతం అడ్డగోలు సంపాదనకు తెరలేపుతున్నారు. మూసాపేట సర్కిల్-23లోని బాలాజీ నగర్ డివిజన్‌లో ప్లే పార్కును ఓ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించారు. సదరు పార్కును డెవలప్‌మెంట్ చేసి వ్యక్తి అందులో ప్లేయింగ్ కోర్ట్ (ఎనిమిది రకాల క్రీడలు) ఏర్పాటు చేసి ఫీజులు పెట్టి నిర్వహణ చేపడుతున్నాడు. అంతేకాకుండా ఏటా బల్దియాకు రూ. 18 లక్షలు చెల్లిస్తున్నాడు. మూడేళ్ల పాటు సదరు వ్యక్తికి పార్కును లీజు ఇచ్చారు. స్టాండింగ్ కమిటీలో చర్చించి 2019 డిసెంబర్ 5న నిర్ణయం తీసుకున్నారు. ఐతే గడువు ముగిసిన నేటికీ ఎలా కొనసాగుతుందంటూ ఫిర్యాదులు రావడం వెనుక విచారణ చేపడితే స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండానే మరో మూడేళ్ల పాటు ఆ వ్యక్తికి జోనల్ కమిషనర్ కట్టబెట్టారని తేలింది. దీంతో తక్షణమే ఈ తరహా ఎక్కడెక్కడ ఉన్నాయనే అంశంపై ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. అంతేకాకుండా జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఆస్తులు ఏవైనా సరే ఇక మీదట స్టాండింగ్ కమిటీలో చర్చించాకే తదుపరి కేటాయింపులు జరిగేలా తీర్మానం చేశారు. ఏడాది నుంచి మూడేళ్ల పాటు లీజు, నిర్వహణ ఏదైనా స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదనలు పెట్టాలని కమిటీ సభ్యులు తీర్మానం చేశారు.

### గడువు ముగిసిన చర్యలేవీ?

జీహెచ్‌ఎంసీ ఆస్తులను దశాబ్దాల క్రితం అద్దెకు తీసుకొని గడువు ముగిసినా, వాటిని ఖాళీ చేయకుండా ఇతరులకు అప్పగించకుండా అడ్డుపడుతున్న లీజుదారులు, వాటిని సబ్ లీజులకు ఇచ్చి లక్షల రూపాయలు అద్దెలు వసూలు చేసుకొని జీహెచ్‌ఎంసీకి కేవలం వేలల్లో మాత్రమే చెల్లిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 22 మార్కెట్లుండగా, వాటిలో 2152 స్టాళ్లు ఉన్నాయి. వెజిటేబుల్ మార్కెట్లు 5, నాన్ వెజ్ మార్కెట్లు 7 రెండు కలిపి 10 ఉన్నాయి. మున్సిపల్ కాంప్లెక్స్‌లు 19 ఉండగా యూనిట్లు 715 వరకు ఉండగా మోడల్ మార్కెట్లు 37 ఉండగా 589 షాపులు ఉన్నాయి. సుమారు రెండు దశాబ్దాల నుంచి అద్దెలు చెల్లించని వ్యాపారులు ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారే తప్ప వారిని ఖాళీ చేయించి కొత్త టెండర్ల ద్వారా ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టి సారించడంలో ఎస్టేట్ విభాగం విఫలం చెందిందన్న ఆరోపణలు ఉన్నాయి.

### ఆన్‌లైన్‌లోకి చేర్చేదెప్పుడు..?

గ్రేటర్ వ్యాప్తంగా జీహెచ్‌ఎంసీ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి దాని ప్రకారంగా కంప్యూటరైజ్ చేశారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయిన, ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారం దరికీ నోటీసులు జారీ చేసి వాటి వివరాలను అందులో పొందుపర్చాలని నిర్ణయించారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అని క్షేత్ర స్థాయిలో జోనల్ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులు విచారించి ఈ నివేదిక సిద్ధం చేయడంలో తాత్సారం చేస్తుండటం గమనార్హం.





# ప్రకంపనలు సృష్టించిన పారా హుషార్

### చర్చనీయంగా మారిన డబుల్ బెడ్రూం ఇండ్ల వ్యవహారం

### ఓ మంత్రి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, మే 6: జూబ్లీహిల్స్ నియోజకవర్గం కమలానగర్ డబుల్ బెడ్రూం ఇండ్లను గుట్టు చప్పుడు కాకుండా సొంతం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం లోని పెద్దలు, అధికార పార్టీ నేతల ప్రయత్నాలపై నమస్తే తెలంగాణ మంగళవారం పారా హుషార్ పేరుతో ప్రచురించిన కథనం ప్రకంపనలు సృష్టించింది. గత ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని కమలా నగర్ బస్తీలో నిర్మించిన 210 డబుల్ ఇండ్లలో స్థానికులకు కేటాయించగా మిగిలిపోయిన 60 ఇండ్లపై పైరవీకారులు ప్రభుత్వ పెద్దలు కన్నేశారు. గుట్టు చప్పుడు కాకుండా సుమారు 68 మందిని లబ్ధిదారులుగా ప్రతిపాదిస్తూ జాబితాలు సిద్ధం చేసినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఓ మంత్రి కీలక పాత్ర పోషించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన కోటా కింద కొన్ని ఇండ్లు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తాజాగా తెలిసింది. దీంతో పాటు నియోజకవర్గంతో సంబంధం లేని వారి పేర్లు జాబితాలో ఉండడంతో స్థానికులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. సనత్ నగర్ నియోజక వర్గం పరిధిలోకి వచ్చే రాణిగంజ్ సమీపంలోని అంబేద్కర్ నగర్ బస్తీకి చెందిన నలుగురు పేర్లను జాబితాలో చేర్చడం చర్చనీయాంశంగా మారింది. దీంతోపాటు యూసుఫ్ గూడ, ఎల్ నగర్, ఎల్లారెడ్డి గూడ, ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోకి వచ్చే చింతల్ బస్తీ ప్రాంతాలకు చెందిన వారి పేర్లు కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. దీంతో 60 డబుల్ బెడ్రూం ఇండ్లను తమవారికే ఇచ్చుకునేలా అధికార పార్టీ నేతలు చక్రం తిప్పినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. జాబితాలో ఉన్నవారిలో ఎవరెవరికి ఎంత ముట్టింది అనే అంశాలతో పాటు ఎవరి కోటా కింద మిగతా IIవ పేజీలో

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### అనుమతులకు విరుద్ధంగా ఆసుపత్రులు

### జరిమానాలు విధిస్తూ, సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): ఇటీవల ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నిర్మాణంలో ఉన్న డాక్టర్ శంకర్స్ పీపుల్స్ హాస్పిటల్ పై ఫిర్యాదు రావడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనిఖీలు నిర్వహించి నిర్మాణంలో కనీస జాగ్రత్తలు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జిల్లా వైద్యాధికారులు విచారణ కమిటీ వేశారు. ఆసుపత్రిలో ఎలాంటి నిబంధనలు పాటించలేకుండా జీహెచ్‌ఎంసీ నుంచి స్టిల్ట్ ప్లస్ 4 అంతస్తులు, 11.08 మీటర్ల ఎత్తు నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారని, కానీ వాస్తవంగా అది 18.75 మీటర్ల ఎత్తు వరకు నిర్మించారని..నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు కనీసం అగ్నిమాపక శాఖనుంచి ఎన్‌ఓసీ కూడా తీసుకోలేదని నివేదికిచ్చారు. దీంతో మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో 2 ఆసుపత్రులను సీజ్ చేసి 15 ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులిచ్చారు.



### రూల్స్‌కు విరుద్ధంగా..

ప్రైవేట్ ఆసుపత్రులు గ్రేటర్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను తుంగలో తొక్కుతూ కనీస అవసరాలు కూడా ఆసుపత్రిలో లేకుండానే మెడికల్ దందాకు తెరలేపుతున్నారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వైద్యాధికారులు జరుపుతున్న క్షేత్రస్థాయి తనిఖీల్లో వాస్తవాలు బయటపడుతున్నాయి. కనీసం ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ లేకుండా, రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయకుండానే వైద్యంతో వ్యాపారం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన ఆసుపత్రులు 2800 ఉండగా అంతకు మించి రిజిస్ట్రేషన్ కానీ క్లినిక్‌లు ఉండటం గమనార్హం. హైదరాబాద్ జిల్లాలో గతేడాది నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు ఆసుపత్రుల్లో వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించి రూ. 16లక్షల జరిమానా విధించారు. 6 ఆసుపత్రులను సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో సైతం 76 క్లినిక్‌లకు జరిమానా విధించగా, 6 ఆసుపత్రులు, 4 క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ ఏడాది సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 8 ఆసుపత్రులకు జరిమానా విధించడంతోపాటు, 3 ఆసుపత్రులను సీజ్ చేశారు. మేడ్చల్ జిల్లాలో కేవలం రెండు నెలల కాలంలోనే 40 ఆసుపత్రులల్లో తనిఖీలు నిర్వహించి 15 ఆసుపత్రులకు షోకాజ్ మిగతా IIవ పేజీలో

# ఉద్యమాలు చేయరు.. ఉత్సవాలకు వస్తారు

## హెచ్‌సీయూ ఆందోళనల్లో కనిపించని ఎన్ఎస్‌యూఐ

### సుకూన్ ఫెస్ట్‌లో భాగం చేయాలని వాగ్వాదం

### రాజకీయాలు చేయొద్దని విద్యార్థుల హెచ్చరిక

సిటీ బ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సుకూన్ ఫెస్ట్‌లో ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నేతలు జేఏసీ ప్రతినిధులతో గొడవకు దిగారు. సుకూన్ ఫెస్ట్ నిర్వహణలో తమను భాగస్వామ్యం చేయాలని విద్యార్థులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడినట్లు తెలిసింది. హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల్లో కాంగ్రెస్ సర్కార్ సృష్టించిన విధ్వంసమే థీమ్‌గా ఈ వేడుకలను గత గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించారు. 400 ఎకరాలను కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్‌కు కట్టబెట్టకుండా అడ్డుకునేందుకు చేపట్టిన ఆందోళనలు, నిరసనల్లో ఏనాడూ పాల్గొనని ఎన్ఎస్‌యూఐకు వేడుకల నిర్వహించే హక్కు లేదని జేఏసీ ప్రతినిధులు తేల్చి చెప్పారు. దీంతో స్టేజ్ పైకి వెళ్లి జేఏసీ విద్యార్థులతో వాగ్వాదానికి దిగారు. ఎన్ఎస్‌యూఐ, జేఏసీ విద్యార్థుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడిందని విద్యార్థులు చెబుతున్నారు. యూనివర్సిటీ భూములను రక్షించడానికి తమతో కలిసి రాకుండా కాంగ్రెస్ సర్కారుకు వంతపాడిన వారు ల్యాండ్ థీమ్‌తో నిర్వహించే ఫెస్ట్‌లో భాగం కావడానికి వీల్లేదని మిగతా IIవ పేజీలో



వాగ్వాదానికి దిగిన విద్యార్థులు

## ఉద్యోగులను దోషులుగా నిలబెట్టే యత్నం

### కక్షగట్టడం మంచి పద్ధతి కాదు

### సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, మే 6 : ఉద్యోగులను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉద్యోగులు ఎప్పుడూ ముఖ్యమంత్రి కి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు కదా అన్నారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చమంటే కాల్చుకొని తినుర్రి.. కొరుక్కొని తినుర్రి అని ముఖ్యమంత్రి మాట్లాడే మాటలు సరికాదన్నారు. ముఖ్యమంత్రి మాటలతో ప్రజలు విస్తూ పోతున్నారని ఆమె అన్నారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. పైసా అప్పు పుడుతలేదని, ఎవరూ నమ్మడం లేదని ముఖ్యమంత్రి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

